

ప్రశాంతంగా పాలిసెట్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 27: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు పాలిసెట్-2024 అర్హత ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 5,476 మంది విద్యార్థులకు గాను 4,857 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 619 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మొత్తం జిల్లాలో 88.07 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

వాగ్దానాల జోరులో వైసీపీతో సాటి ఎవ్వరూ రారు. ప్రజల కష్టాలు తీర్చి అందలం ఎక్కిస్తామని అన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జనం నమ్మారు. ఓట్లు వేసి అధికారం అప్పగించారు. ఆ తర్వాత అంతా మర్చిపోయారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం వైసీపీ చేతిలో పూర్తిగా దగా పడింది. మాటలు తప్ప పనులు చేయని ఎమ్మెల్యే ఎట్లా ఉండేదీ నియోజకవర్గ ప్రజలకు అనుభవంలోకి వచ్చింది. ఇలాంటి పార్టీని మళ్లీ ఎలా గెలిపిస్తామని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు.



ఆలయం వద్ద నత్తనడకన సాగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు

ఆళ్లగడ్డలో అన్నీ సమస్యలే

- నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే
- కష్టాలు తీరని చాగలమర్రి
- రాజోలి జలాశయానికి గ్రహణం
- సంత మార్కెట్లలో కనీస వసతులు కరువు
- శిథిలావస్థలో లక్ష్మీ నరసింహ స్వామి
- ఈసారి వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని అడుగుతున్న ప్రజలు

నంద్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి)/ చాగలమర్రి/ శిరివెళ్ల :

నియోజకవర్గంలో ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న రాజోలి జలాశయాన్ని నిర్మించి రైతుల వెతలు తీర్చుతామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. పంట కాలువలను మెరుగు పరిచి ఆయకట్టు భూములకు నీరిస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తామన్నారు. వైఎస్ జగన్, స్థానిక ఎమ్మెల్యే వరస పెట్టి వాగ్దానాలు ఇచ్చారు. ప్రజలు నిలదీస్తారనే భయం లేకపోవడంతో వాటన్నిటినీ మర్చిపోయారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న దేవస్థానం బాగోగుల పట్టించుకోకపోవడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా మండల కేంద్రాల్లోని సంతల్లో అసౌకర్యాల కంపు కొడుతోంది. శిరివెళ్లలోని యర్రగుంట్ల డిగ్రీ కళాశాల పీజీ కళాశాలగా మారుతుందన్న ఆశ కలగానే మిగిలిపోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఆళ్లగడ్డ నియోజకవర్గం సమస్యల చిట్టా చాంతాండంత అవుతుంది. ఇవన్నీ తెలిసి కూడా వీటి గురించి పట్టించుకునే తీరిక లేకుండా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి ఐదేళ్ళు గడిపారు. ఇక మళ్లీ ఎన్నికలు రాగానే ప్రజల ముందుకు వచ్చి తాము చేసిన అభివృద్ధి, అందించిన సంక్షమ పథకాలు చూసి ఓటేయమని మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఆయనకు ఒకసారి కూడా ఓటేస్తే నియోజకవర్గం అభివృద్ధి శాశ్వతంగా వెనక్కి తీసుకువెళతారనే అభిప్రాయాన్ని ఓటర్లు వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం..

నంద్యాల-గిద్దలూరు నల్లమల అడవిలో ఉన్న సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారని చెబుతారు. 2018లో కురిసిన వర్షాల ధాటికి ఆలయ ముందు భాగంలోని పురాతన రాతి కట్టడం, ప్రహరీ, ధ్వజస్తంభం కూలిపోయాయి. ఆలయం కింద నుంచి పై భాగం వరకు దాదాపు 50 అడుగుల మేర నిర్మాణ పనులు చేపట్టాలంటే కోట్ల రూపాయలు ఖర్చవుతాయని దేవదాయ శాఖ వారు అంచనా వేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.20 లక్షల దేవదాయశాఖ నిధులతో 2020వ సంవత్సరంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తర్వాత రూ.1.6 కోట్ల టీటీడీ నిధులతో రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, అప్పటి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి 2022, జూన్ 4న భూమి పూజ చేశారు. అయితే ఆ తర్వాత నిధుల మంజూరు విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో ఆలయ పునరుద్ధరణ పనులు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. ఈ దేవాలయ పునరుద్ధరణ పనులపట్ల ప్రభుత్వానికి, స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.



చాగలమర్రిలో పిల్లర్లతోనే నిలిచిన తహసీల్దార్ కార్యాలయం

పీజీ కళాశాల కల తీరేదెన్నడు..?

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై యర్రగుంట్ల సమీపంలో గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్ ముగియగానే పక్కనే ఉన్న డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఆ తర్వాత పీజీ చేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అయితే చాలా మంది ఆర్థిక స్థోమత దృష్ట్యా, దూరాభారాల దృష్ట్యా డిగ్రీతోనే తమ చదువును నిలిపివేస్తున్నారు. ఆ ఇబ్బంది తీర్చేలా అధికారులు ఈ కళాశాలలోనే పీజీ కళాశాల కూడా ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. మండల ప్రజలు కూడా పీజీ కళాశాల గురించి కూడా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ఈ కళాశాలలో ఫోర్ ఇయర్స్ ఆనర్స్ డిగ్రీ విధానాన్ని యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తే నాలుగేళ్లలోనే డిగ్రీ, పీజీ పూర్తి చేసుకుని పట్టభద్రులవుతారని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ పీజీ కళాశాల కలగానే మిగిలిపోయింది. జూనియర్, డిగ్రీ కళాశాలలకు రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రారంభించి వదిలేశారు..

2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చాగలమర్రి మండలం రాజోలి వద్ద జలాశయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టును రూ.1357.20 కోట్ల అంచనా వ్యయంతో, 2.95 టీఎంసీల సామర్థ్యంతో దాదాపు 91 వేల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా నిర్మించేందుకు 2019 డిసెంబరు 18న పరిపాలన అనుమతులు ఇచ్చారు. 2019 డిసెంబరు 23న కడప జిల్లా దువ్వూరు మండలం నేలటూరు గ్రామం వద్ద ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా చేశారు. వాస్తవానికి ఈ జలాశయం నిర్మాణాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో డిసెంబరు 23న రూ.291.02 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. తండ్రి చేపట్టిన నిర్మాణాన్ని కొడుకు నెరవేరుస్తున్నాడని మండల ప్రజలు ఆనంద పడ్డారు. ఇక రిజర్వాయర్ నిర్మాణం మొదలైనట్లేనని నమ్మారు. కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు మాత్రమే ఈ తతంగమంతా అని అర్థం కావడానికి ప్రజలకు ఎక్కువ కాలం పట్టలేదు. ఈ జలాశయం నిర్మాణం భూసేకరణను దాటి ముందుకు సాగలేదు. పైగా రైతుల వద్ద నుంచి సేకరించిన 10 వేల ఎకరాల పాసు పుస్తకాలను కూడా ప్రభుత్వం తీసేసుకుంది. కానీ వారికి భూ పరిహారం కింద ఎకరాకు రూ.12.50 లక్షలు ఇంకా ఇవ్వనే లేదు. దీనికి తోడు ఆ భూముల క్రయవిక్రయాలు జరగకుండా రెడ్‌మార్కులో పెట్టారు. దీంతో రాజోలి జలాశయానికి భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం రాక, తమ భూములను వేరే వాళ్లకు అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నారు. జలాశయం నిర్మాణమైతే భూములకు నీటి సాగునీటి సమస్య తీరుతుందని భావించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

కుందూనదిపై జలాశయం నిర్మించే ప్రాంతం



అధ్వాన స్థితిలో కేసీ పంట కాలువలు

ఆళ్ళగడ్డ నియోజకవర్గంలోని భూములకు కాలువల ద్వారా సాగునీరు అందుతుంది. అయితే వైసీపీ ప్రభుత్వం పంట కాలువలను మరమ్మతు చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి మండలంలోని మల్లేవేముల, చాగలమర్రి, నేలంపాడు గ్రామాల పరిధిలో కేసీ పంట కాలువలు అధ్వానస్థితిలో ఉన్నాయి. చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని కేసీ పంట కాలువలను బాగు చేసి రైతుల సమస్యను తీరిస్తే బాగుంటుంది. ఇక దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ భవనాల నిర్మాణం కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాగలమర్రిలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన తహసీల్దార్ భవన నిర్మాణం నేటికి పిల్లర్లకే పరిమితమైంది. ఈ భవనానికి రూ.95 లక్షలు నిధులు గత టీడీపీ ప్రభుత్వ హయంలో మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ భవనం నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. పంచాయతీరాజ్ అధికారులు రెండు విడతలుగా భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. పాలకుల నిర్లక్ష్య వల్ల ఈ భవన నిర్మాణం పూర్తి కాలేదు.





రాజోలి జలాశయానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం(ఫైల్)



యర్రగుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల



శిరివెళ్లలో సౌకర్యాలు కరువైన సంత మార్కెట్

మార్కెట్లలో సమస్యల మోత..

శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, మహదేవపురం గ్రామాల్లోని సంతమార్కెట్లు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో యర్రగుంట్లలో ప్రతి బుధవారం గ్రామంలోని ప్రధాన రహదారిలో, శిరివెళ్లలో ప్రతి ఆదివారం వక్ఫ్‌బోర్డు స్థలంలో సంత నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో వర్షాకాలంలో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యర్రగుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దినసరి మార్కెట్, వారపు సంత, కబేళా ద్వారా 2019-20 నుంచి 2024-25 వరకు ఆరు సంవత్సరాలకు గాను రూ.65.56 లక్షల ఆదాయం వచ్చింది. శిరివెళ్లలోని సంతమార్కెట్లు, కబేళా ద్వారా 2019-20 నుంచి 2024-25 వరకు ఆరు సంవత్సరాలకు గాను రూ.74.65 లక్షల ఆదాయం సమకూరింది. అలాగే మహదేవపురం పంచాయతీలో వారపు సంతకు ఆరేళ్లకు గాను రూ.31.84 లక్షల ఆదాయం వచ్చింది. ఇక నియోజకవర్గంలోని రుద్రవరం మండలంలోని వారసంత మార్కెట్ సమస్యల చెంత కొట్టుమిట్టాడుతుంది. ఇక్కడ ప్రతి సోమవారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంతకు మార్కెట్‌కు కొండమాయపల్లె, నాగిరెడ్డిపల్లె, మాకినేనిపల్లె వంటి 16 గ్రామాల ప్రజలు సరుకులు కొనేందుకు వస్తారు. వారపు సంత మార్కెట్ వేలం ద్వారా రూ.9.03 లక్షలు, రోజువారి మార్కెట్ వేలం ద్వారా రూ.3.70 లక్షలు, కబేలా మార్కెట్ వేలం ద్వారా రూ.8,200 ఆదాయం వస్తోంది. ఈ స్థాయిలో ఆదాయం వస్తున్నా ఈ సంతలో కనీస వసతులు, మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా మార్కెట్ వేలాల ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా ఇక్కడ సౌకర్యాల గురించి, వసతుల గురించి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రేపు నందికొట్కూరుకు చంద్రబాబు

నందికొట్కూరు, ఏప్రిల్ 27: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 29వ తేదీన నందికొట్కూరు పట్టణానికి రానున్నారని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శనివారం అల్లూరు గ్రామ సమీపంలో హెలిప్యాడ్ స్థలాన్ని మాండ్ర శివానందరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్‌లో అల్లూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి నందికొట్కూరు అల్లూరు సర్కిల్, కొత్త బస్టాండ్ మీదుగా పటేల్ సెంటర్ వరకు రోడ్డు షో, పటేల్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. అనంతరం అల్లూరు గ్రామం వద్ద బస చేస్తారన్నారు. 30వ తేదీ ఉదయం అక్కడి నుంచి బయలుదేరతారని ఆయన తెలిపారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించిన వారిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాండ్ర, డీఎస్పీ

బుగ్గన నామినేషన్ ఎందుకు తిరస్కరించలేదు..?

- ఆర్వో ఆమోదించడంపై న్యాయ పోరాటం
- టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

డోన్, ఏప్రిల్ 27: వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేషన్‌లో ఎన్నో తప్పులున్నప్పటికీ ఎందుకు తిరస్కరించలేదని టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, లీగల్ సెల్ న్యాయవాదులు శ్రీనివాస భట్, కోట్ల హరిశ్చంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి వ్యవహరించిన తీరు అభ్యంతరమని అన్నారు. వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేషన్‌లో తప్పులున్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఫారం-26ఏలో కాలమ్స్ పూరించకుండా ఖాళీగా ఉంచినా, సమాచారాన్ని ఇవ్వకపోయినా నామినేషన్ పత్రాలను తిరస్కరించే అధికారం ఆర్వోకు ఉందని తెలిపారు. ఎస్ ఫర్ బుక్ కాండేట్ 54, 55, 56 నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాల్లో బుగ్గన తన ఆస్తులను సక్రమంగా కనబరచలేదని అన్నారు. ఇట్లాంటి నామినేషన్ పత్రాలను ఆర్వో ఎందుకు తిరస్కరించలేదని ప్రశ్నించారు. మొదట పెండింగ్‌లో ఉంచినా.. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి టీడీపీ అభ్యంతరాలను పక్కన పెట్టి, ఎలాంటి విచారణ లేకుండా ఏకపక్షంగా బుగ్గన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారని ఆరోపించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, న్యాయవాదులు ఆలా మల్లికార్జున రెడ్డి, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, తోట మనోహర్ బాబు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ

నంద్యాల క్రైం ఏప్రిల్ 27 : నంద్యాల జిల్లా కేంద్రంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలనాధికారి హిమాన్షు శంకర్ త్రివేది శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, స్థానిక పోలీస్ అధికారులు, కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆయన కవాతు నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన దళితవాడ అప్పర్‌ప్రైమరీ గాంధీజీ పురపాలక పాఠశాల, గుర్రాలపేట మున్సిపల్ హైస్కూల్ కేంద్రాలను వారు స్వయంగా పరిశీలించారు.



పరిశీలించేందుకు వెళ్తున్న ఎన్నికల ప్రత్యేక పరిశీలనాధికారులు

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరచే స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం ఎన్నికల ప్రత్యేక పరిశీలనాధికారులు ఎ. దినేష్‌కుమార్, హిమాన్షు శంకర్ త్రివేది, ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆర్‌జీఎం కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రత్యేక పరిశీలనాధికారిగా నియమితులైన ఎ.దినేష్‌కుమార్‌ను నంద్యాల ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.


రుద్రవరం మండలం నరసాపురం మద్యం షాపు వద్ద క్యూలో ఉన్న మద్యంప్రియులు


మద్యం నిత్య ఎలాగా అబ్బా...!

మహానంది/ రుద్రవరం, ఏప్రిల్, 27: ఎన్నికల్లో ప్రతి రోజూ మద్యం పంపిణీ చేయడం ఆయా పార్టీలకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గత ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో ఎంత వరకు విక్రయాలు జరిగాయో అంతే జరపాలని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు రావడమే ఇందుకు కారణం. ఈ మేరకు టార్గెట్ పూర్తయిన వెంటనే మద్యం దుకాణాలను మూసివేస్తున్నారు. దీంతో ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలకు మద్యం అందించడం కష్టంగా మారింది. సాయంత్రం వేళ గ్రామాల్లో ప్రచారం పూర్తయిన వెంటనే పాల్గొన్న ఆయా పార్టీల కార్యకర్తలు నాయకుల దగ్గరికి వచ్చి మాది మాకిస్తే వెళ్తాం అంటూ క్యూ కడుతున్నారు. వీరికి ఎలా సర్దాలో అర్థంగాక మద్యం పంపిణీ చేసే ఆయా పార్టీ నాయకులు ఇబ్బంది పడుతున్నారు.

- ప్రచారం పూర్తి అయినా వెంటనే మద్యం ఇవ్వాల్సిందే
- తలలు పట్టుకుంటున్న గ్రామీణ స్థాయి నాయకులు
- మందు ఇస్తామంటేనే ప్రచారానికి ..
- ఇంకా పదిహేను రోజులు ఎలా భరించాలి

ఉచిత విద్యుత్ హామీ ఏమాయనో..!

బనగానపల్లె, ఏప్రిల్ 27: సీఎం జగన్ బనగానపల్లె మండలం హుసేనాపురం గ్రామ సభలో ఇచ్చిన హామీని మరచిపోయారు. 1999 ఎన్నికల సందర్భంగా బనగానపల్లె మండలంలో ప్రచారం చేశారు. హుసేనాపురంలో జరిగిన మహిళా సదస్సులో వైసీపీ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు గృహ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా ఆ హామీని నిలబెట్టుకోలేదు. దీంతో మాట ఇచ్చి తప్పడం జగన్‌కు అలవాటేనని ఈప్రాంత ప్రజలు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు.



హలో సార్.. మీ ఓటెవరికి?

కొత్త నంబర్ల నుంచి ఫోన్ కాల్స్



చాగలమర్రి, ఏప్రిల్ 27: ఓ వైపు ఎన్నికల ప్రచారంతో మైకులు మార్మోగుతుండగా మరోవైపు సెల్‌ఫోన్ కాల్స్ హోరెత్తిస్తున్నాయి. రోజుకు ఏడెనిమిది సార్లు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల తరఫున ఫోన్‌లు వస్తున్నాయి. హలో సార్.. మీరు ఏ పార్టీకి ఓటు వేస్తారు, ఏ పార్టీ గెలిస్తే బాగుంటుంది వంటి వివరాలతో విసిగెత్తిస్తున్నారు. బిజీ సమయాల్లో కొత్త నంబర్‌ల నుంచి వస్తున్న కాల్స్ చూసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులని లిఫ్ట్ చేస్తే చివరకు ప్రచార సమాచారం వస్తోంది. దీంతో వెంటనే కాల్ కట్ చేస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

డిజిటల్ పేమెంట్స్ ద్వారా మద్యం విక్రయాలు


మద్యం షాపు వద్ద మందుబాబులు
డిజిటల్ పేమెంట్ ద్వారా మద్యం అమ్మకాల దృశ్యం

నంద్యాల నూనెపల్లె/వెలుగోడు/రుద్రవరం, ఏప్రిల్ 27: వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఇన్నాళ్లకుగాను డిజిటల్ పేమెంట్ ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రెండు రోజుల నుంచి ఫోన్‌పే ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యాన్ని నివారించేందుకు ఈ విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇంతకాలం సాంకేతిక సమస్యలు చూపించి డిజిటల్ పేమెంట్‌కు నిరాకరించిన మద్యం షాపుల నిర్వాహకులు ఈ సారి ఫోన్‌పే ద్వారా విక్రయాలు జరపాల్సిన పరిస్థితి. ఇదిలాఉంటే మొన్నటి వరకు నగదు మాత్రమే అని చెప్పి ఇప్పుడు ఫోన్‌పే అంటే ఎలా అని మద్యంప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు డిజిటల్ పేమెంట్స్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామని చెప్పారు.

ఐదేళ్లలో చేసింది శూన్యం

- ఎంపీ పోచాను నిలదీసిన చౌట్కూరు గ్రామస్థులు


చౌట్కూరు గ్రామంలో ఎంపీ పోచాను నిలదీస్తున్న గ్రామస్తులు

మిడుతూరు, ఏప్రిల్ 27: ఐదేళ్ల వైసీపీ పాలనలో తమ గ్రామానికి ఒక్క పని కూడా చేయలేదని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని చౌట్కూరు గ్రామస్తులు నిలదీశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో పీరుసాహెబ్‌పేట, మిడుతూరు, చౌట్కూరు తదితర గ్రామాల్లో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో హామీలు ఇస్తారుగాని తమ గ్రామానికి ఒక్క పని కూడా చేయలేదని ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ పోచాను నిలదీశారు. గ్రామానికి దూరంగా పొలాల్లో, రస్తా సరిగా లేని ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని గ్రామ సర్పంచు, వైసీపీ కార్యకర్తలు ఎంపీ ఎదుట వాపోయారు. చౌట్కూరు గ్రామంలో సచివాలయ నిర్మాణం కూడా పునాదులకే పరిమితమైందని అన్నారు. గ్రామంలో ఓ వైసీపీ నాయకుడి నిర్వాహకం వల్లే అభివృద్ధి కుంటుబడిందని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. చౌట్కూరు గ్రామం నుంచి ఓర్వకల్లు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా ఉండంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామంలో వైసీపీ పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయి మరో వర్గానికి చెందిన నాయకుడిపై విమర్శలు చేసుకోవడం గమనార్హం.

టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఎందుకంటే...!

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఈ నెంబరుతో అన్ని జిల్లాల్లోనూ కాల్ సెంటర్లను ప్రారంభించింది. ముఖ్యంగా 1950నే ఎందుకు ప్రవేశ పెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషన్‌ను ప్రారంభించిన సంవత్సరానికి గుర్తుగా ప్రజలు మరువకుండా ఉండేలా ఈ నెంబరును దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

నల్లమలలో పోలింగ్ కేంద్రం

- పదేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి చొరవతో ఏర్పాటు
- ఓటు వేయాలంటే 104 కి.మీ. ప్రయాణించాల్సి ఉండేది
- పెచ్చెర్వు చెంచుగూడెంలో ప్రస్తుతం 203 మంది ఓటర్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 27:

నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడేనికి అరుదైన చరిత్ర ఉంది. నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి సుమారు 15 కి.మీ. గల పెచ్చెర్వు చెంచుగూడెం ఒకనాటి చెంచుల రాజధానిగా పేరుగాంచింది. అంతేకాదు బ్రిటీష్ పాలకులు పెచ్చెర్వు కేంద్రంగా విలువైన కలపను దోచుకెళ్లేవారు. ఈ క్రమంలోనే పెచ్చెర్వులో బ్రిటీష్ వారు పలు కట్టడాలను కూడా నిర్మించారు. అయితే సుమారు 37 ఏళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోకి వెళ్లడంతో పెచ్చెర్వు గూడేన్ని పునరావాసం కింద ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామ పంచాయతీలో గల కొట్టాలచెరువు చెంచుగూడేనికి తరలించారు. ఆ సమయంలో పెచ్చెర్వువాసులకు కొట్టాలచెరువులో ఇళ్ల నిర్మాణాలతోపాటు అటవీ హక్కుల చట్టం కింద వ్యవసాయ భూములను కూడా పంపిణీ చేశారు. అయితే కొట్టాలచెరువు ప్రాంతంలో నివాసం తమ జీవనానికి అనుకూలంగా లేదన్న కారణంతో చాలా మంది తిరిగి పెచ్చెర్వుకి వెళ్లిపోయారు. నల్లమలలోని పెచ్చెర్వులో జనసంచారం వల్ల పులుల సంరక్షణకు ఆటంకం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో వారిని తిరిగి కొట్టాలచెరువుకు తరలించేందుకు నేటికీ అటవీశాఖ అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే అప్పట్లో నల్లమల అటవీ ప్రాంతం కేంద్రంగా మావోయిస్టుల కదలికలు అధికంగా ఉండేవి. దీంతో ఆత్మకూరు నుంచి సుమారు 42 కి.మీ. దూరంలోని పెచ్చెర్వులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నిక అధికారులు ఎవరూ సాహించలేదు. దీంతో పెచ్చెర్వువాసులకు ఓటు హక్కు ఒక కలగానే ఉండేది.


నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడెం

ఓటు వేయాలంటే..

నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో పోలింగ్ కేంద్రం లేనప్పుడు గూడెం వాసులు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే 104 కి.మీ. ప్రయాణించాల్సిన దుస్థితి ఉండేది. గూడెం నుంచి కాలినడకన 15 కి.మీ. కీకారణ్యంలో నడిచి రోళ్లపెంట ఘాట్ సమీపంలో కర్నూలు-గుంటూరు రహదారికి చేరుకోవాల్సి ఉండేది. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి 27 కి.మీ. దూరంలో ఉన్న ఆత్మకూరుకు చేరుకోవాల్సి ఉంది. ఆ తర్వాత ఆటోలను ఆశ్రయించి మరో 10 కి.మీ. దూరం ప్రయాణిస్తే.. కొట్టాలచెరువుకు చేరుకోవచ్చు. ఇలా ఓటు వేసేందుకు రానుపోను దూరం దాదాపు 104 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. పైగా ఓటు వేయాలంటే వ్యయ ప్రయాసలు భరించాల్సి ఉండేది. దీంతో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కాకముందే చాలా మంది పెచ్చెర్వువాసులు తమ జీవితకాలంలో ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితులు ఉండేవి. అయితే పలు ఎన్నికల సందర్భాల్లో ఎన్నికల విభాగం అధికారులే పెచ్చెర్వు ఓటర్లు కొట్టాలచెరువులో తమను ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వాహనాలు, భోజన వసతి కల్పించేవారు. అయినప్పటికీ సుదూర ప్రాంతానికి వెళ్లి ఓటు వేసేందుకు చెంచులు ఆసక్తి చూపేవారు కాదు.



పదేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ చొరవతో...

ప్రజాస్వామ్య వ్యవస్థలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న భావనతో అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా పెచ్చెర్వు చెంచుగూడేంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో గూడెంలో 120 మంది ఓటర్లు ఉండేవారు. వీరి కోసం పెచ్చెర్వులో ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పెచ్చెర్వు గూడెంవాసులు తమ ఓటు హక్కును ఉపయోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అసలే నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వులో విద్యుత్, రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలేవి లేనప్పటికీ ప్రతిష్ఠాత్మకంగా పెచ్చెర్వు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో దిగ్విజయంగా ఓటింగ్ జరిపించారు. కాగా ప్రస్తుతం పెచ్చెర్వు చెంచుగూడెంలో 203 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 93మంది పురుష, 110 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పెచ్చెర్వులో 42 నంబర్ గల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇదిలావుంటే నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో ఎన్నికల ప్రచారం చేసేందుకు కూడా రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. ప్రతిసారి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రతినిధులను పెచ్చెర్వుకు పంపించి పోల్ మేనేజ్‌మెంట్ జరుపుకుంటున్నారు. ఏదూమైనా.. పెచ్చెర్వు చెంచు గిరిజనులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమని చెప్పవచ్చు.





ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే..

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న భావనతోనే నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడేంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. కమ్యూనికేషన్ లేని ఏరియాలో పెచ్చెర్వు ఉండటం వల్ల షాడో ఏరియాగా గుర్తించి ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్లతోపాటు భారీ బందోబస్తుతో పోలింగ్ నిర్వహణ జరిగేలా ప్రణాళిక రూపొందించాం. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కేంద్రాన్ని కొనసాగిస్తాం.

- సుధారాణి, రిటర్నింగ్ ఆఫీసర్, శ్రీశైలం

మీ కష్టాలు తీరుస్తాం

చిరు వ్యాపారితో బీసీ జనార్దన్‌రెడ్డి


పండ్లు అమ్మే వ్యాపారి కష్టాలు అడిగి తెలుసుకుంటున్న టీడీపీ బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి రాగానే చిరు వ్యాపారుల కష్టాలు తీరుస్తానని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని కొండపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కళింగర పండ్లు అమ్ముతున్న వ్యాపారిని అడిగి చిరువ్యాపారి కష్ట నష్టాలను గురించి ఆరా తీశారు. పండ్ల ధరలను, వ్యాపారికి గిట్టుబాటు విషయంపై అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటామని బీసీ హామీ ఇచ్చారు.

ఒక నియోజకవర్గం.. రెండు జిల్లాలు

గడివేముల, ఏప్రిల్ 27 : రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ నియోజకవర్గ స్వరూపాలను మార్చివేసింది. కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఓటర్ల పరంగా అతి పెద్ద నియోజకవర్గంగా ఉన్న పాణ్యం రెండు జిల్లాలకు విస్తరించింది. 2022, ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పాణ్యం నియోజకవర్గాన్ని భౌగోళిక విస్తీర్ణాలతో సంబంధం లేకుండా రాజకీయ కారణాలతో కర్నూలు జిల్లాలో కలిపి వేసింది. దీంతో నంద్యాల జిల్లాకు సమీపంలో ఉన్న పాణ్యం, గడివేముల ప్రజలు జిల్లాల పునర్విభజనను నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి పాణ్యం నియోజకవర్గాన్ని రెండు జిల్లాల్లో చేర్చింది. గడివేముల, పాణ్యం మండలాలను నంద్యాల జిల్లాలో, కర్నూలు, కల్లూరు మండలాలతోపాటు కర్నూలు కార్పొరేషన్‌లోని 16 వార్డులను కర్నూలు జిల్లాలో చేర్చింది. గతంలో పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం మండలంతోపాటు బనగానపల్లె, వెల్దుర్తి, బేతంచెర్ల మండలాలు ఉండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలతోపాటు కర్నూలు కార్పొరేషన్‌లోని వార్డులు కలిసి పాణ్యం నియోజకవర్గంగా ఏర్పడింది. పాణ్యం నియోజకవర్గంలో 3,22,493 మంది ఓటర్లలో పాణ్యం మండలంలో 36,893 మంది ఓటర్లు, గడివేముల మండలంలో 34,411 మంది, ఓర్వకల్లులో 48,121 మంది, కల్లూరు మండలంలో 2,03,068 మంది ఓటర్లు ఉన్నారు. పాలన పరంగా రెండు జిల్లాల్లో ఉన్న పాణ్యం నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ కర్నూలు జిల్లా పాలనా అధికారుల పర్యవేక్షణలో సాగుతోంది. రెండు జిల్లాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గ ఓటర్లు నంద్యాల లోక్‌సభ, పాణ్యం అసెంబ్లీ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓట్లు వేయాల్సి ఉంటుంది. 340 పోలింగ్ కేంద్రాలున్న ఈ నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కల్లూరు మండల ఓటర్లు అభ్యర్థుల గెలుపోటములలో కీలక పాత్ర పోషించనున్నారు.



కూల్‌గా ప్రచారం



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ఎన్నికల పోలింగ్ సమయానికి కౌంట్ డౌన్ మొదలైంది. దీంతో గెలుపు కోసం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార స్టైల్ మార్చారు. గతంలో మాదిరిగా ఉదయం 9 నుంచి కాకుండా 7 గంటల నుంచే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టిస్తున్నారు. 11 గంటలకే ముగించి మళ్లీ సాయంత్రం 4 నుంచి 9 వరకు కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయంలోనే పెట్టుకుంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు, భవిష్యత్ వ్యూహాలపై చర్చిస్తున్నారు. ఇదే సమయంలో కొందరు పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎండవేడికి భయపడి ప్రచారాలు ఎప్పుడు ముగుస్తాయా అని కేడర్ రోజులు లెక్క పెడతోంది.

ప్రచురణకర్తలూ... జాగ్రత్త

నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లే మార్గదర్శకాలపై ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ

శిరివెళ్ల, ఏప్రిల్ 27: రాష్ట్రంలో ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నులయ్యారు. ఓటర్లను ప్రభావితం చేసి తమ వైపు తిప్పుకోవడం కోసం గతంలో చేసిన పనులు, అధికారంలోకి వస్తే చేయబోయే పనులు, పలు వాగ్దానాలు ఇస్తుంటారు. రాష్ట్ర నాయకత్వం పంపించిన ప్రచార సామగ్రికి అభ్యర్థులు తయారు చేసుకుంటున్న ప్రచార సామగ్రి తోడవుతోంది. ఇందుకోసం కరపత్రాలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీలు ముద్రిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రచారం తాలూకా ప్రచురణపై ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్-127 ప్రకారం విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లుగా భావించడంతోపాటు చట్టప్రకారం కేసు నమోదు చేస్తారు. ఈ క్రమంలో ప్రచురణలపై ఎన్నికల సంఘం వెలువరించిన ఉత్తర్వులు ఇలా ఉన్నాయి.

- కరపత్రాలు, ఫ్లెక్సీలు, గోడపత్రికలు ముద్రించే వ్యక్తి(ప్రచురణ కర్త) డిక్లరేషన్ తాలూక రెండు ప్రతులను తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి పొందాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ తాలూకా ఒక ప్రతిని ముద్రించిన ప్రతితో జత చేసి.. రాష్ట్ర రాజధాని అయిన పక్షంలో ప్రధాన ఎన్నికల అధికారికి, జిల్లా కేంద్రంలో అయితే కలెక్టర్‌కు అందజేయాలి.
- ఏ రాజకీయ పార్టీ అయినా, పోటీ చేసే అభ్యర్థి అయినా ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఆరు నెలలు జైలు, రూ.2 వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది.
- పత్రికల్లో ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా వచ్చే వార్తా కథనాలు, సంపాదకీయాలు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎన్నికల సంఘం సూచనలు జారీ చేసింది.
- ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-77(1) ప్రకారం ఈ కథనాలకు అయ్యే ఖర్చును సైతం పోటీలో ఉన్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసే అవకాశం ఉంది.
- ఒకవేళ అభ్యర్థి అనుమతి లేకుండా ప్రకటనలు, వార్తా కథనాలు ముద్రిస్తే ఐపీసీ సెక్షన్ 171-హెచ్ ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థి పక్షానైనా ప్రకటనలు ఇచ్చేందుకు లేదా ఏ అభ్యర్థి గురించి అయినా వ్యతిరేకంగా ప్రకటనలు ఇచ్చేందుకు, ముద్రించే వారి పేరు(ప్రచురణ కర్త), ముద్రించిన ప్రకటన ప్రతిని ఈసీ అధికారులకు సమర్పించాలి.





కరువు బండ యాత్ర సమావేశంలో వైఎస్, బొజ్జా, గంగుల, కాటసాని, ఎంవీ మైసూరారెడ్డి (ఫైల్)


రాజకీయ ఉద్దండులు

● యువ రక్తంతో రాజకీయాల్లోకి వచ్చి చక్రం తిప్పిన నేతలు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 27 : రాయలసీమ సాగునీటి సమస్యలపై కర్నూలు, కడప జిల్లాల నేతలు కరువు బండ యాత్ర పేరుతో నిర్వహించిన ఉద్యమంలో నంద్యాలలో సమావేశం నిర్వహించినప్పటి ఫొటో ఇది. 1986-87 మధ్య రోజుల్లో అప్పటి యువ కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డిపాడుకు వెళ్తూ మధ్యలో సమావేశం నిర్వహించారు. ఈ ఫొటోలో ఉన్న అప్పటి యువ నాయకులు.. రాజకీయ ఉద్దండులుగా రాణించారు. మెలివేసిన మీసాలు, జుంపాల జుట్టుతో సమావేశంలో ప్రసంగిస్తున్న వ్యక్తి గంగుల ప్రతాపరెడ్డి. రాజకీయాల్లో యువ కెరటంలా వచ్చి ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా, నంద్యాల ఎంపీగా, రాజ్యసభ సభ్యుడిగా, కాంగ్రెస్ అధిష్ఠానంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి గంగుల ప్రతాపరెడ్డి. బీజేపీ, టీడీపీలో కూడా గంగుల ప్రతాపరెడ్డి చక్రం తిప్పినప్పటికీ ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. సభా వేదికపై ఆశీనులైన వారిలో కుడివైపు మొదటి వ్యక్తి బొజ్జా వెంకటరెడ్డి, నంద్యాల శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థకు రెండు సార్లు చైర్మన్‌గా పని చేశారు. మరణించే వరకు కాంగ్రెస్ వాదిగా ఉన్న రాజకీయ ఉద్దండుడిగా బొజ్జాకు రాజకీయ రంగంలో పేరు ఉంది. బొజ్జా పక్కన కూర్చున్న వ్యక్తిని చూడండి.. నూనూగు మీసాలతో, యువతేజంతో అప్పట్లోనే చక్రం తిప్పి, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన నేతగా పేరుగాంచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. వైఎస్ పక్కన చిన్నపాటి క్రాఫ్‌తో, వచ్చిరాని గడ్డంతో కూర్చున్న వ్యక్తి కాటసాని రాంభూపాల్‌రెడ్డి. రాజకీయాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ఉద్దండుడిగా పేరుగాంచారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా పాణ్యం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు. చివరగా కూర్చున్న వ్యక్తి సన్నటి మీసాలు, రింగుల జుట్టుతో ఉన్న వ్యక్తిని నిశితంగా చూడండి. కాంగ్రెస్‌లో ఉన్నా, టీడీపీలో ఉన్నా, వైసీపీలో ఉన్నా కేంద్ర పాలక మండళ్లలో చక్రం తిప్పారు. మాజీ హోం శాఖ మంత్రిగా పని చేశారు. ఆయనే సీనియర్ నాయకుడు ఎంవీ మైసురారెడ్డి. వీరంతా అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వీరి వెనుక చేతికింద చిన్నపాటి బ్యాగ్‌ను పెట్టుకొని ఉన్న వ్యక్తి నంద్యాల పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు లగిశెట్టి సుబ్బగురుమూర్తి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఐదు దశాబ్దాలు కొనసాగారు.

ఎమ్మెల్యే శ్రీదేవి మాటలు నమ్మి మోసపోయామని జనాలు చర్చించుకుంటున్నారు. హామీ ఇచ్చినట్టుగా అభివృద్ధి చేస్తారనుకుంటే ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దికెరలో సాయినగర్ కాలనీ ఏర్పడి 25 ఏళ్లయింది. 'ఇక్కడ మౌలిక వసతుల గురించి ఎవరూ కూడా పట్టించుకోలేదు.. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కాలనీలో ఉచితంగా ఇంటింటికి కొళాయిలు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు వేసి అభివృద్ధి చేస్తా' అని 2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హామీ ఇచ్చారు. అభివృద్ధి చేయకపోతే.. ఓట్లు అడిగేందుకు కూడా రానని గట్టిగా చెప్పడంతో ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. గెలిచి ఎమ్మెల్యే అయ్యాక.. ఆ హామీని పట్టించుకోలేదు. ఐదేళ్లు నిర్లక్ష్యం చేసి తీరా ఎన్నికల ముందు నాలుగు నెలల క్రితం పైపులైన్ పనులు ప్రారంభించారు. ఎన్నికలు వచ్చేలోపు ఇంటింటికి నీరందిస్తామని నమ్మబలికి ఆ పనుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. ప్రజలు దీంతో అసహనం వ్యక్తం చేసి నమ్మి మోసపోయామన్న ఆవేదనలో ఉన్నారు.

- మద్దికెర



నత్తనడకన నడుస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులు

● హామీని విస్మరించిన ఎమ్మెల్యే శ్రీదేవి


● ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని సాయినగర్ కాలనీ

● గుక్కెడు నీరు కరువే..



నమ్మి మోసపోయాం

మద్దికెర గ్రామంలోని సాయినగర్ కాలనీలో దాదాపు 450 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీ అభివృద్ధి చెందినప్పటికీ రోడ్లు లేవు, డ్రైనేజీలు లేవు.. తాగేందుకు గుక్కెడు నీరు కూడా లేదు. దీంతో ప్రజలందరూ కాలనీలోని సుంకులమ్మ దేవాలయం వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యే శ్రీదేవి దేవాలయ ప్రాంగణంలో సాయినగర్ కాలనీకి రోడ్లు వేస్తానని, ఇంటింటికీ ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇస్తామని.. లేకపోతే తనకు ఓటు వేయవద్దంటూ.. గత ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికారు. పార్టీ అధికారంలోకి రాగానే ఏమాత్రం సమస్యను పట్టించుకోలేదు. తాగునీటి సమస్యపై రెండేళ్ల కిందట ఎమ్మెల్యే మద్దికెర వస్తుంటే.. కాలనీవాసులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే కారును అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పట్టించుకోకుండా తమ కాలనీ వైపు తిరిగి చూడలేదు. దీంతో కాలనీవాసులు ఆగ్రహంతో ఉన్నారు. గమనించిన ఎమ్మెల్యే శ్రీదేవి నామ్‌కేవాస్తేగా కాలనీకి సీసీ రోడ్లు వేయడానికి రూ.55 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలనీలో మూడు రోడ్లు వేశారు. అది కూడా నాసిరకంగా డ్రైనేజీలు లేకుండా వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ పథకం కింద మద్దికెరకు రూ.1.85 కోట్లు నిధులు మంజూరు కావడంతో సాయినగర్ కాలనీలో పైపులైన్ వేశారు. 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నప్పటికీ ఐదు నెలలైనా ముందుకు సాగడం లేదు. ఎన్నికల్లో నీరు ఇచ్చి హామీ నిలబెట్టుకుంటామని నమ్మబలికారు. పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వేసవి కాలం గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రజలను ఇంకా నమ్మించాలని చూస్తున్నారు. హామీలు ఇచ్చి విస్మరించిన శ్రీదేవమ్మను ప్రజలు ఎలా నమ్ముతారో వేచి చూడాలి మరి.



డ్రైనేజీలు, నీరు లేవు



సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్లు వేశారు కానీ.. డ్రైనేజీలు లేవు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గుక్కెడు నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇంటింటి కొళాయి ఎప్పుడు ఇస్తారో వారికే తెలియాలి.

శ్రీనివాసులు, కాలనీవాసి

అంతా హంగామానే



ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించండి.. ఉచితంగా ఇంటింటికి కొళాయి ఇస్తాం.. రోడ్లు, డ్రైనేజీలు వేస్తాం అంటూ హామీ ఇచ్చి హంగామా చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు నిద్రపోయి ఎన్నికలు ముందుకు రాగానే పనులు మొదలు పెట్టారు. మిమ్మల్ని ఎలా నమ్మాలి అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

- మాబాషా, కాలనీవాసి



మురుగు కాలువ లేకుండా వేసిన సీసీ రోడ్డు



అభివృద్ధికి నోచుకోని సాయినగర్ కాలనీ ఇదే

గతమెంతో ఘనం

● ఒకనాటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని కర్నూలు

● తొలిసారిగా దామోదరం సంజీవయ్య, ఎం.శంకర్‌రెడ్డి ద్విసభ్యుల ఎంపిక

● హ్యాట్రిక్ సొంతం చేసుకున్న ఏకైక ఎమ్మెల్యే రాంభూపాల్ చౌదరి

కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంగా 1952లో ఏర్పడింది. ఆనాటి ఎన్నికల్లో కర్నూలు నుంచి దామోదరం సంజీవయ్య, ఎం.శంకర్‌రెడ్డిలు ద్విసభ్యులుగా ఎంపికై మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలో తొలిసారిగా అడుగు పెట్టారు. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజాగోపాలాచారి (రాజాజీ) క్యాబినెట్‌లో దామోదరం సంజీవయ్య హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత ద్విసభ్యత్వం రద్దయింది. 1955లో జరిగిన ఎన్నికల్లో ఎంఏ ఖాన్ ఎమ్మెల్యేగా గెలిచారు. 1952 నుంచి 2019 వరకు 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ద్విసభ్యులతో కలిపి 16 మంది ఎమ్మెల్యేలుగా ఎంపికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించాక 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వి.రాంభూపాల్‌చౌదరి విజయం సాధించారు.

● **ముగ్గురు మంత్రులు:**

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 పర్యాయాలు ఎన్నికలు జరిగితే 12 మంది ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన వి. రాంభూపాల్‌చౌదరి తరువాత కాంగ్రెస్‌లో చేరారు. 1985, 1989లోనూ వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్న ఏకైక ఎమ్మెల్యే రాంభూపాల్ చౌదరి. రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ 1999, 2009లో రెండు సార్లు, సీపీఎం సీనియర్ నాయకుడు ఎంఏ గఫూర్ 2994, 2004లో రెండు సార్లు విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడ్డాక తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన దామోదరం సంజీవయ్య మద్రాసు రాష్ట్రం సీఎం రాజాజీ ప్రభుత్వంలో హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 35 ఏళ్ల తరువాత వి.రాంభూపాల్‌చౌదరి సీఎం ఎన్.జనార్దన్‌రెడ్డి క్యాబినెట్‌లో సహకార శాఖ, సీఎం కోట్ల విజయభాస్కరెడ్డి క్యాబినెట్‌లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. 20 ఏళ్ల తరువాత ఉమ్మడి రాష్ట్రం చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లో టీజీ వెంకటేశ్ చిన్నతరహా నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.





టీడీపీకి కంచుకోట పత్తికొండ

పత్తికొండ, ఏప్రిల్ 27: టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన తొమ్మిది సార్వత్రిక ఎన్నికలు, ఒక ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థులే ఏడు సార్లు విజయం సాధించారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మహాబలేశ్వరగుప్తా గెలిచారు. అయితే రెండు నెలలు గడవకముందే ఆయనను ప్రత్యర్థులు హత్య చేశారు. ఆతర్వాత జరిగిన ఉప ఎన్నికలో గుప్తా సతీమణి సుబ్బరత్నమ్మ టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శేషిరెడ్డి గెలిచారు. 1994లో టీడీపీ అభ్యర్థి ఎస్వీ సుబ్బారెడ్డి విజయం సాధించారు. ఆతర్వాత 1999, 2004 ఎన్నికల్లో కూడా ఆయన టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి కేఈ ప్రభాకర్, 2014 ఎన్నికల్లో కేఈ క్రిష్ణమూర్తి టీడీపీ అభ్యర్థులుగా గెలిచారు. 1994 నుంచి 2014 వరకు వరుసగా ఐదు సార్లు విజయం సాధించిన టీడీపీ 2019లో ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీదేవి గెలిచారు.



వీధుల్లో తిరిగే కెమెరా..!



నిఘా బృందం సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 27: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆధునాతన కెమెరాలతో నిఘా బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. కర్నూలు జిల్లాలోని 8 నియోజకవర్గాలలో 68 ఫ్లయింగ్ స్క్వాడ్ టీఎం(ఎఫ్ఎస్‌టీ)ల వాహనాలకు అత్యాధునికమైన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాహనాలకు పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఆ వాహనం ప్రయాణిస్తున్న ప్రదేశాలకు సంబంధించి నిరంతర ప్రత్యక్ష వీడియో కవరేజ్‌కు వీలవుతుంది. ఈ వీడియో కవరేజ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌లో ఉన్న ఎఫ్ఎస్‌టీ బృందాలు ఎన్నికల పనితీరును పర్యవేక్షిస్తారు. కెమెరాలు ఏర్పాటు చేయడం వద్ద ఏదైనా ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సమావేశాల నిర్వహణ, ఓటర్లకు డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు గురిచేసే వారిపై ప్రతిబంధకంగా పని చేస్తాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కెమెరాలను ఏర్పాటు చేసింది. ప్రతి వాహనంలో ఓ అధికారి, ఒక ఏఆర్ పోలీసు, సివిల్ పోలీసుతో పాటు వీడియోగ్రాఫర్ ఉంటారు.



కారు టాప్‌పైన సీసీ కెమెరా

పైన గాంభీర్యం... లోలోన గుబులు...!



ఆదోని, ఏప్రిల్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని వ్యూహాలు రచిస్తున్నారు. పైకి గాంభీర్యంగా కనిపిస్తున్నా.. లోలోపల గుబులుగానే ఉన్నారు. ఏ పార్టీ ఏ వర్గం ఓట్లకు ఎసురు పెడుతుందోనని లెక్కలేసుకుంటున్నారు. దాని ప్రకారం ఆ వర్గపు ఓట్లు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.

● **ప్రతి పార్టీలోనూ చేరికలు...**

ప్రతి పార్టీలోనూ చేరికలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్ని కండువాలు ఎవరికి కప్పారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. తమ పార్టీలో చేరి కండువాలు కప్పుకున్న వారంతా ఓట్లు వేస్తారని భావించరాదని అభ్యర్థుల అనుచరులు హెచ్చరిస్తున్నారు. మీవెంటే మేమున్నామంటూ భరోసా ఇచ్చిన వాళ్లు రాత్రికి రాత్రి పార్టీలు మారడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం వంటి పరిణామాలతో అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దిద్దుబాటు చర్యలకు అభ్యర్థులు పరుగులు పెడుతున్నారు. పార్టీ మారుతున్నట్టు ప్రచారం జరిగిన వ్యక్తులతో మంతనాలు సాగిస్తున్నారు. ఎ

● **ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి....**

పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రచారాలతో పాటు ప్రలోభాలకు తెరలేపుతున్నారు. ముఖ్యంగా పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రతి వార్డులో 10 నుంచి 15 మంది దాకా నమ్మదగిన వ్యక్తులను ఏర్పాటు చేసుకుని ఓటరు స్లిప్పుల పేరుతో ఇతర కారణాలతో ప్రతి ఇంటికి వెళ్లడం, వారితో మాట్లాడి తాయిలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.

హలో.. అన్నా నమస్తే.. ఊరికి రండి



ఆలూరు, ఏప్రిల్ 27: నమస్తే అన్న అక్క బాగున్నారా.....? ఏ ఊర్లో ఉన్నారు. ఎన్నికలు మే 13న ఉంటాయి. మీరు తప్పకుండా ఉరికి రావాలి. మీతోపాటు ఎంత మంది మన ఉరు వాళ్లు ఉన్నారు. వాళ్ళ ఫోన్ నెంబర్ల ఇవ్వండి... వాళ్లను కూడా అడిగాను అని చెప్పండి. మళ్లీ మేమే వాళ్లకి కాల్ చేస్తాం. మీరు రెండు రోజులు ముందే రండి... మీరు ఎంత మంది ఉన్నారో చెబితే చార్జీలకు డబ్బులు ఫోన్‌పే ద్వారా వేస్తామంటూ బెంగళూరు, ముంబై, గుంటూరు, హైదరాబాద్, వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి ప్రధాన పార్టీల అభ్యర్థుల అనుచరులు వల వేసి ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. మన అభ్యర్థికి తప్పకుండా ఓటు వేస్తే మీకు ఎన్నికలకు ముందే మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో చెబితే అన్ని ఓట్లకు డబ్బులు ఇచ్చేస్తాం. అంటూ వారికి టచ్‌లో ఉంటున్నారు. ఓటరు జాబితాలో వలస ఓటర్ల పేర్లు, సీరియల్ నెంబర్, బూత్ నెంబర్ తీసుకొని జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఇదేం మేనిఫెస్టో..

● సీఎం జగన్‌పై సర్వత్రా విమర్శలు



గోనెగండ్ల, ఏప్రిల్ 27: పేద ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా వైసీపీ మేనిఫెస్టో ఉంటుందని ఆ పార్టీ నాయకులు ఇటీవలి కాలంలో తెగ ఉపన్యాసాలు ఇచ్చారు. అయితే శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజల నుంచి వ్యతిరేక స్పందన వస్తోంది. పాత పథకాలను కొనసాగించడం తప్ప మరో కొత్త ఏమీలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ ప్రస్తుతం రూ.3000 ఇస్తున్నారు. అదీ కూడా 2028లో రూ.250 2029లో మరో రూ.250 పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇలా మేనిఫెస్టో మొత్తం చెత్తగా మారిందంటూ ఓటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ మేనిఫెస్టో నవ్వులపాలు



వైసీపీ మేనిఫెస్టో నవ్వులపాలైంది. ప్రస్తుతం వృద్ధులకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.3,500 పెంచేందుకు రెండు దఫాలుగా ప్రకటించారు. నాలుగేళ్లకు రూ.250 పెంచి మరో ఎన్నికల ఏడాది మరో రూ.250 పెంచడం దారుణం ఇది ప్రజలకు మోసం చేయడ కాక మరేమిటి. అన్నీ పాత పథకాలే. టీడీపీ మేనిఫెస్టోకు ఏవీ సరికావు.

- రామకృష్ణ, జిల్లా తెలుగు యవత మాజీ ఉపాధ్యక్షుడు గాజులదిన్నె

నమ్మి మోసపోయారు



ఒకసారి జగన్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు. అమ్మఒడి పథకం అమలులో గతంలోనే జగన్ ప్రభుత్వం ఒక విద్యార్థికి రూ.15వేలు అన్నారు. తీరా చేస్తే రూ.13వేలకు కుదించారు. ఇది నిజం కాదా? ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ రూ.15వేలు అమ్మ ఒడి రాలేదు. ఇద్దరికి ఇస్తామని ఒక్కరికే మితం చేశారు. ఇప్పుడు రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచుతున్నామంటే నమ్మకం కుదరదు. మరోసారి జగన్‌ను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు.

- చెన్నలరాయుడు, గోనెగండ్ల

పెంచిన ట్యాక్స్‌లకే వాహన మిత్ర సరి



ట్యాక్సీ, ఆటో ఉన్న వారికి ప్రతి ఏడాది వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.10వేల ప్రకారం ఐదేళ్లకు రూ.50 వేలు ఇచ్చారు. కానీ అదేరీతిలో ట్యాక్స్‌లు కూడా పెంచారు. ఇలా ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో ట్యాక్సుల రూపంలో లాక్కున్నారు. ఇక వాహనదారుడికి ఏం లాభం. ప్రస్తుతం ఉన్న వాహన మిత్ర పథకమే చాలామందికి సక్రమంగా అమలు కాలేదు.

- మాబు, గోనెగండ్ల

ఈ ఏడాది రైతు భరోసానే అమలు కాలేదు



ఈ ఏడాది రైతులకు రైతుభరోసా పథకం కింద డబ్బులు విడుదల కాలేదు. గత ఏడాది రైతు భరోసా కింద రూ.13,500 ఇచ్చారు. అయితే ఈ ఏడాది రైతు భరోసా ఇవ్వలేదు. రైతులు ఎదురుచూసి మోసపోయారు. సక్రమంగా ఇవ్వని పథకానికి ఈ మేనిఫెస్టో డబ్బులు పెంచుతామంటే నమ్మే స్థితిలో రైతులు లేరు. రూ.16వేలు ఇస్తామంటే నమ్మకం కుదరడం లేదు. -కౌలుట్లయ్య నాయుడు గోనెగండ్ల

మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి

● యువతకు ఉపాధి కల్పిస్తాం ● వైసీపీ అక్రమాలను వెలికి తీస్తాం ● అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం ● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి


శ్రీశైలంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి


ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న బుడ్డా శైలజమ్మ

శ్రీశైలం, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి వస్తే శ్రీశైలం మండలంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుడ్డా శ్రీశైలం నుంచి శనివారం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శ్రీశైలంతో పాటు సుండిపెంట, లింగాలగట్టులో ప్రచారం చేశారు. ఈ ప్రాంతాల నుంచి 250 కుటుంబాలు వైసీపీని వీడి బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే శిల్పా తన అనుచరులతో కలిసి మల్లన్న సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. ఇళ్లు కట్టించి ఇస్తానని నమ్మబలికి శ్రీశైలం ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఎన్ని పూర్తి చేశారని ప్రశ్నించారు. ఎక్కడి నుంచో వచ్చిన శిల్పా నియోజకవర్గ ప్రజలను బెదిరిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగటానికి వస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీడీపీ అధికారంలోనికి రాగానే శ్రీశైలంలో ఉన్న దుకాణాలకు కాలపరిమితి 11 ఏళ్లకు పెంచుతూ అధిక బాడుగలను క్రమబద్ధీకరిస్తానని, దుకాణాలకు ముందుగానే కట్టే సంవత్సరం బాడుగ విధానానికి స్వస్తి చెప్పి నెలసరి బాడుగ కట్టే విధానం తీసుకొస్తానని బుడ్డా హామీ ఇచ్చారు. శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే శ్రీశైలంలో నివాసముంటున్న వారికి ఇక్కడే ఉండేందుకు స్థలం చూపిస్తానని, ఆస్తిగా ఇంటి పట్టాలు మాత్రం సుండిపెంటలో కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ఎన్నికలల్లో బుడ్డాను గెలిపిస్తే స్థానికులను సుండిపెంటకు తరలిస్తారని దుష్ప్రచారం చేసి ఓట్లు దండుకున్నారని ఆయన అన్నారు.

'వైసీపీకి తొత్తులుగా దేవస్థానం అధికారులు'

శ్రీశైలం క్షేత్ర పరిధిలోనికి వైసీపీ గుర్తులతో కూడిన ప్రచారరథం తీసుకొచ్చి, వైసీపీ నాయకులు దేవస్థానం నిబంధనలను ఉల్లంఘించినా చర్యలు తీసుకోలేదని, దేవస్థానం అధికారులు వైసీపీకి తొత్తులుగా మారారని బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. ఇటీవల శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీశైలంలో చేపట్టిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో దేవస్థానం ఉద్యోగులు పాల్గొంటే ఎందుకు ఈవో చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తాము మైక్ ప్రచారం అడిగితే ఇవ్వటం కుదరదని తేల్చి చెప్పిన ఈవో వైసీపీకి ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. నిబంధనలను ఉల్లంఘించి ఎన్నికల ప్రచారం చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు శ్రీశైలం దర్శనానికి వస్తే ఈవో ప్రోటోకాల్ పాటించలేదని మండిడ్డారు. వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులపై చర్యలు తీసుకోకపోతే ఈవోపై ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

ఆత్మకూరు: మెరుగైన పాలన అందించే సమర్థవంతమైన నాయకుడిని ప్రజలు ఎన్నుకోవాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సతీమణి బుడ్డా శైలజ పిలుపునిచ్చారు. పట్టణంలోని 7వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా బుడ్డా కుటుంబం ఇక్కడి ప్రజలతో మమేకమై సేవలందిస్తున్నట్లు చెప్పారు. తన భర్త ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శ్రీశైల నియోజకవర్గాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ప్రత్యేకించి సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఆత్మకూరు మండలానికి సాగునీరు అందించారన్నారు. ఆత్మకూరులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.116.93కోట్లతో నాన్అమృత్ స్కీంను మంజూరు చేయించారని చెప్పారు. గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా పథకాలను నిర్మించినట్లు తెలిపారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూతనిచ్చినట్లు వివరించారు. గృహనిర్మాణ పథకం ద్వారా సుమారు 2500 మందికి పక్కాగృహాలను మంజూరు చేయించిన ఘనత టీడీపీదేన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూర్ఖాన్, అబ్దుల్లాపురం బాషా, ఇబ్రహీం ఖలీలుల్లా, యూసుఫ్, పస్సీల్ మున్నా, మహెబూబ్ తదితరులు ఉన్నారు.


శ్రీశైలం: బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీతోనే సమగ్రాభివృద్ధి

● ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శబరి, ఫరూక్


జిల్లెల్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న శబరి, ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 27: రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, ప్రజలు నమ్మారని, అందులో భాగంగా ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శనివారం పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లెల్ల గ్రామంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, సదాశివారెడ్డి, చంద్రశేఖర్రెడ్డి, చిన్న నరసింహారెడ్డి, గోపాల్రెడ్డి, భూపాల్రెడ్డి, భాస్కర్రెడ్డి, వీరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో దోపిడీ, దౌర్జన్యాలు, అరాచ కాలు దోచుకోవడమే జరిగాయని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం పద్మావతి నగర్లోని కాటన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరవాటి నందబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శబరి, ఫరూక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. నందబాబుతో సహా ఆయన కుటుంబ సభ్యులు, 50 మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయకుమార్ తదితరలు పాల్గొన్నారు.

'రాహుల్ను ప్రధాని చేయడమే లక్ష్యం'


నంద్యాలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంకర్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 27: దేశ ప్రధానిగా రాహుల్గాంధీని చేయడమే లక్ష్యమని నంద్యాల పార్లమెంట్ ఏఐసీసీ పరిశీలకుడు శంకర్, ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు, శ్రీశైలం దేవాలయాన్ని టీటీడీ తరహాలో అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని గనులను వెలికి తీసి లాభాలు పంచి పెడతామని, ఆళ్లగడ్డలో రైతులకు మద్దతు ధర ఇవ్వడానికి కృషి చేస్తామని, పాణ్యం నియోజకవర్గంలో ఉన్న విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామని, నందికొట్కూరులో ఆహార పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వాసు, డోన్, బనగానపల్లె, శ్రీశైలం, ఆళ్లగడ్డ అభ్యర్థులు మద్దిలేటిస్వామి, బాలుయాదవ్, ఇస్మాయిల్, హుసేన్బాషా పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 27: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజాసంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శనివారం నంద్యాల 12వ వార్డు గాలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన నౌమాన్, బాషా, మౌలాలితో సహా 70 మంది కుటుంబాలు స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరాయి. 11వ వార్డులో ఎన్నికల ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు.

'జగన్ను ఇంటికి సాగనంపాలి'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 27: ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన కొనసాగిస్తోందని, జగన్ను ఇంటికి సాగనంపాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్ రెడ్డి, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు, కొరకంచి శంకర్ పిలుపునిచ్చారు. చిన్న దేవళాపురం, బరకల కాలనీ గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. కంచర్ల లింగారెడ్డి, మహేష్, వెంకటసుబ్బయ్య, పాలశంకర్, అబ్రోష్, రామచంద్రుడు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

వెలుగోడు, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు ఖలీల్, ఆసర్ వజీర్ అన్నారు. వెలుగోడు పట్టణంలో సోమవారం వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. హుసేన్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత: గౌరు

పాణ్యం, ఏప్రిల్ 27: జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసుగెత్తి టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఇసుక దొరకక భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్లు, ట్రాక్టరు యజమానులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆర్టీసీ చార్జీలు రెండింతలు పెరిగాయన్నారు. నిత్యావసర ధరల నియంత్రణలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఉద్యోగులకు సరైన సమయానికి జీతాలు అందించకపోగా కక్ష సాధింపు చర్యలు చేపట్టడంపై ఉద్యోగ రంగాలు ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. గ్రామాలలో అభివృద్ధి పేరిట నిర్మాణాలు సాగించిన సచివాలయాలు, ఆర్బీకే, ఆరోగ్య, తదితర నిర్మాణాలకు ఇప్పటి వరకు నిధులు అందిచకపోవడంతో నిర్మాణాలు చేపట్టిన అభాగ్యులు అప్పులపాలై కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నిర్మించిన టిడ్కో గృహాలను తన ఖాతాలో వేసుకొని తనే ఇంటి నిర్మాణాలు సాగించినట్లు జగన్ పత్రికలో ప్రచారాలు చేసుకోవ డంపై ప్రజలు నవ్వుకుంటున్నార న్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో జగనన్న కాలనీలు ప్రారంభమే కాలేదన్నారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో వైసీపీ నియోజక వర్గ ప్రజాప్రతినిధులు తెలపాలని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పాణ్యం నుంచి పోటీ చస్తున్న గౌరు చరిత, పార్లమెంట్ కు నంద్యాల నుంచి పోటీ చేస్తున్న బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, జిల్లా కార్యదర్శి రమణమూర్తి, నాయకులు గోవర్ధన్రెడ్డి, హనుమంతరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహబూబ్బాషా, మనోహర్రెడ్డి, మోహన్రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

జగన్రెడ్డి కాదు...బటన్రెడ్డి

● అరాచక పాలన అంతమే కూటమి పంతం
● ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాండ్ర శివానందరెడ్డి, అభ్యర్థి గిత్తా జయసూర్య


అల్లూరులో 'అరాచక పాలన అంతం.. కూటమి పంతం' చార్జిషీట్ను విడుదల చేస్తున్న నాయకులు


చింతలపల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 27: పరిపాలన అంటే కేవలం బటన్ నొక్కడమే అనే కొత్త అర్థాన్ని తీసుకొచ్చినందుకు జగన్రెడ్డికి బటన్ రెడ్డి అని పేరు సరిపోతుందని టీడీపీ నంద్యాల లోక్సభ నియోజకవర్గ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి ఎద్దేవా చేశారు. అల్లూరు గ్రామంలో అరాచకపాలన అంతం.. కూటమి పంతం అంటూ జగన్మోహన్రెడ్డి ఐదేళ్ల పాలనపై ఎన్డీఏ తయారు చేసిన చార్జీషీట్ను మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్రెడ్డి, జనసేన నాయకుడు రవి విడుదల చేశారు. మాండ్ర మాట్లాడుతూ పేదవారికి పెత్తందారులకు యుద్ధం అని చెబుతున్న జగన్.. నందికొట్కూరు నియోజకవర్గంలో 2 ఎకరాల పొలం ఉన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెత్తందారా...? లేక వందల కోట్ల ఆస్తులున్న వైసీపీ అభ్యర్థి ధార సుధీర్ పేదవారా? చెప్పాలని సీఎం జగన్ను డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో ఇస్కాల ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తి చేస్తే మిగిలిన 5 శాతం పనులను వైసీపీ పాలనలో పూర్తిచేయకపోవడం దారుణమన్నారు. జయసూర్య మాట్లాడుతూ సానుభూతితో ప్రజలు సీఎంను చేస్తే.. అధికార దర్పంతో తెరచాటున, విమానాలు, హెలికాప్టర్లలో తిరుగుతున్నారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్రెడ్డి, జనసేన నాయకులు మాట్లాడుతూ జగన్ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

● నందికొట్కూరులోని 15వ వార్డులో ఇన్చార్జి గోవర్ధనగిరి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, పరిశీలకుడు శ్రీకాంత్రెడ్డి ప్రచారం చేశారు. జయసూర్య సైకిల్ తొక్కుతూ ప్రచారం నిర్వహించారు. నాయకులు భాస్కర్రెడ్డి, ముర్తుజావలి, జాకీర్, షకీల్ అహ్మద్, శాంతరాజు, మల్లికార్జునరెడ్డి, లింగమయ్య, రాజు, రాజన్న పాల్గొన్నారు.

● నందికొట్కూరులోని 24వ వార్డులోని బుడగ జంగాల తెగకు చెందిన 30 కుటుంబాలు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు జంగాల మధు, వార్డు ఇన్చార్జి బాషా, యూనిట్ ఇన్చార్జి సత్తార్ మియా, క్లస్టర్ ఇన్చార్జి ముర్తుజావలి ఆధ్వర్యంలో చేరాయి. శ్రీనివాసులు, మధు, డి.శేఖర్, రాజ్కుమార్, మల్లికార్జున, శివశంకర్ తదితరులు టీడీపీలో చేరారు.

● జూపాడుబంగ్లా మండలం తుడిచెర్ల నాయకులు బాలమద్దిలేటి, రాముడు, సత్యనారాయణశెట్టి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి ప్రచారం చేపట్టారు. నాగేంద్ర గౌడ్, జయరాముడు, మాల్యాద్రి, చిన్న వెంకటస్వామి, హనుమంతు, ఈశ్వరయ్య, పెద్ద నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని నంద్యాల లోక్సభ నియోజకవర్గ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి అన్నారు. శనివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర దంపతుల సమక్షంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనజ, మాల మహానాడు సీనియర్ నాయకుడు రాజులు టీడీపీలో చేరారు.

మిడుతూరు: చింతలపల్లి గ్రామంలో శనివారం మండల కన్వీనర్ కాతా రమేశ్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డితో కలిసి టీడీపీ అభ్యర్థి జయసూర్య ప్రచారం నిర్వహించారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఎల్లారెడ్డి, రంగా రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, శివరామి రెడ్డి, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


అల్లూరులో మాండ్ర శివానందరెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకురాలు, మాల మహానాడు నాయకుడు రాజులు

నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27: నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రావినూతల దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. శనివారం నంద్యాల బార్ అసోసియేషన్కు జరిగిన ఎన్నికల్లో దుర్గాప్రసాద్ తన సమీప ప్రత్యర్థి ఎస్.నందీశ్వరరెడ్డిపై 99 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అలాగే జనరల్ సెక్రటరీగా భూపని వెంకటేశ్వర్లు తన సమీప ప్రత్యర్థి కె.శ్రీనివాసులుపై 141 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా భూమా వెంకటరెడ్డి తన సమీప ప్రత్యర్థి డి.చిన్నలింగమయ్యపై 141 ఓట్ల తేడాతో గెలుపొందారు. కాగా వైస్ ప్రెసిడెంట్గా పీడీ హుసేన్బాబు, కోశాధికారిగా ఎస్.మద్దిలేటిరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా సింగరి జీవన్రాజ్, జాయింట్ సెక్రటరీగా ఎం.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామకృష్ణయ్య, చిన్నసుధాంశురెడ్డి, రాజేశ్వరరెడ్డి, ఎ.రఘుప్రకాష్, అల్లాబకాష్ ఎన్నికల కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

'ఓటమి భయంతోనే వైసీపీ దిగజారుడు చర్యలు'

ఆత్మకూరు, ఏప్రిల్ 27: ఓటమి భయంతోనే నంద్యాలకు చెందిన వైసీపీ కిరాయి లాయర్లు దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు కంచర్ల గోవిందరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో భాగంగా టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్ను రిటర్నింగ్ ఆఫీసర్ పక్కన పెట్టారని వైసీపీ తరుపు న్యాయవాది ఎంవీ.కృష్ణారెడ్డి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆర్వో కార్యాలయంలో అనుమతి లేకుండా వీడియోలో తీసి తప్పుడు ప్రచారం చేసిన న్యాయవాది కృష్ణారెడ్డిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు కె.కేశవరెడ్డి, గిరిరాజు, రవికుమార్, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివ ప్రసాద్రెడ్డి, వేణుగోపాల్ ఉన్నారు.

భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

● నలుగురిని అరెస్టు చేసిన కొత్తపల్లి పోలీసులు
● కేసులో ఇద్దరు వైసీపీ నాయకులను తప్పించినట్లు ఆరోపణలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

ఆత్మకూరు/కొత్తపల్లి, ఏప్రిల్ 27: ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులోని కృష్ణానది తీరంలోని జానాల- సంగమేశ్వరం వద్ద తెలంగాణ మద్యాన్ని తరలిస్తుండగా కొత్తపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలివి.. తెలంగాణ మద్యాన్ని కృష్ణానదిపై మరబోట్లలో దాటించి ఆత్మకూరుకు ఓ వాహనం తీసుకొస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సంగమేశ్వరం పరిసర ప్రాంతాల్లో తన సిబ్బందితో గస్తీ నిర్వహించినట్లు చెప్పారు. ఈక్రమంలోనే చేపలను ఎగుమతి చేసే వాహనంలో 91కేసుల క్వార్టర్ సీసాల తెలంగాణ మద్యాన్ని లోడు చేసుకుని వస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని కొత్తపల్లి పోలీసుస్టేషన్కు తీసుకెళ్లి మద్యాన్ని పోలీసుస్టేషన్లో ఉంచినట్లు తెలిపారు. కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, సురేష్ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడంతో పాటు పట్టుబడిన వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.5.6లక్షలు ఉంటుందని వెల్లడించారు. కాగా ఎన్నికల నేపథ్యంలో పట్టుబడిన తెలంగాణ మద్యం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వారి కోసం ఆత్మకూరుకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేసులో ఇద్దరు వైసీపీ నాయకులను తప్పించినట్లు ఆరోపణలు

సంగమేశ్వరం వద్ద తెలంగాణ మద్యం పట్టుబడిన కేసులో కొత్తపల్లి మాజీ జడ్పీటీసీ పురుషోత్తం రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బామ్మర్ది మండ్లెం ప్రతాపరెడ్డి పట్టుబడినప్పనట్లు తమ దృష్టికి వచ్చిందని టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ మద్యం కేసును నిష్పక్షపాతంగా వ్యవహరించి పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సూత్రధారులెవరో పోలీసులకు తెలుసు అని, కేవలం వాహన డ్రైవర్, కూలీల పేర్లను కేసులో పొందుపర్చి అసలైన దోషులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈవిషయంపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని అసలైన దోషులపై కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

జగన్ మాటలు సంస్కారహీనం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన రజక కుటుంబాలు

డోన్, ఏప్రిల్ 27: సొంత చెల్లెలు వైఎస్ షర్మిలను పట్టుకుని సీఎం జగన్ సంస్కారహీనంగా మాట్లాడడం మహిళలందరినీ అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలో సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో వంద రజక కుటుంబాలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి. అదే విధంగా మండలంలోని సీసంగుంతల, మల్యాల, చిన్నమల్కాపురం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్నమల్కాపురం గ్రామంలో వైసీపీ నాయకులు బింగి సోమన్న యాదవ్, మోకి మద్దయ్య, బింగి శివ, మహేష్, సోమశేఖర్, సుధాకర్‌తో పాటు మరో 30 కుటుంబాలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో అర్జున్ రెడ్డి, రేగటి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైఎస్ షర్మిల పసుపు చీర కట్టుకుని చంద్రబాబు వారసురాలుగా టీడీపీకి మద్దతు తెలుపుతుందని బాధ్యత గల ముఖ్యమంత్రి చెల్లెలినే అవమానించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, తిమ్మయ్య యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, ధర్మవరం భరత్ రెడ్డి, రంజిత్ కిరణ్, వలసల బాలుడు, చిన్నతిమ్మయ్య యాదవ్, మురళీగౌడు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: భూమా జగత్

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఇంజేడు, పెద్దయమ్మనూరు, సర్వాయిపల్లె గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, అనంత రామసుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, సరేష్‌రెడ్డి, నర్శిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహుడు, నడిపి వెంకటసుబ్బయ్య, బాబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.7.58 లక్షలు

బేతంచెర్ల, ఏప్రిల్ 27: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.7.58 లక్షలు సమకూరినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామివారి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండనం, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.7,58,605 లక్షలు ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

కార్మికుడి మృతికి సంతాపం

బనగానపల్లె, ఏప్రిల్ 27: పట్టణంలోని పాతపోలీస్‌స్టేషన్ వెనుక నివసించే పాలిష్ కట్టర్ జమాల్ బాషా(50) శనివారం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. జమాల్‌బాషా మృతదేహానికి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే కరీంబాగ్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ సాబీర్ హుసేన్ ఇటీవల ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను బీసీ రాజారెడ్డి పరామర్శించారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 27: బేతంచెర్ల పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా.. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు వెళ్లాలని సూచించారు. మూడు రోజులుగా హైదరాబాదు బసవతారక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

టీడీపీ విజయానికి కృషి

బనగానపల్లె, ఏప్రిల్ 27: టీడీపీని గెలిపించడం కోసం కృషి చేస్తామని రాష్ట్ర మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాత్రి చిన్నఈశ్వరయ్య మాదిగ తెలిపారు. శనివారం ఆయన బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి టీడీపీకి మద్దతు పలికారు. సాత్రి చిన్న ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ నారా చంద్రబాబును సీఎంగా చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జూటూరు రామాంజనేయులు మాదిగ, అనంతపురం జిల్లా అధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యాదర్శి ఓబులేసు, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు నారాయణస్వామి, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 27: మే ఒకటో తేదీన ఇంటి వద్దనే వృద్ధులకు పింఛన్ ఇవ్వాలని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని వేణుగోపాలయ్యతోట, నాలుగు స్తంభాల గుడి తదితర ప్రాంతాల్లో బీసీ ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజాగళం కార్యక్రమంలో బీసీ మాట్లాడుతూ పింఛన్‌దారులకు ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలని, సీఎం జగన్ కుట్రపూరితంగా ఇంటి వద్ద పంపిణీ చేయకుండా రాజకీయ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేల పింఛన్ ఇచ్చేలా చూస్తామని అన్నారు. జూలై నెలలో రూ.4వేలతో పాటు మరో రూ3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువగళం పథకం ద్వారా 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు నెలకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు : కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలవారు ఇటిక్యాల బాలిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన వీరు శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. కోరుమానుపల్లె గ్రామానికి చెందిన సుంకర గోవర్ధన్, సుంకర చిన్నకొండయ్య, గోవింద్, గణపరెడ్డి, సుబ్బయ్య, మల్లికార్జున తదతరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలోని వైసీపీకి చెందిన షేక్ నూర్‌మహమ్మద్, కోగిల మునీంద్ర, కంబగిరి, తెలుగు తిరుపాల్ శేఖర్, సుపీ మహ్మద్, అక్బర్‌బాషా తదితరులు టీడీపీలో చేరారు. అలాగే అబ్దుల్లాపురం కోరుమానుపల్లెకు చెందిన పలువురు నాయకులు అంబటి జయలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో దళిత నాయకులు పోపులయ్య, సుందరయ్య తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి.



ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకులో.. అవుకు పట్టణంలో శనివారం పత్తి నాగకులాయి ఆధ్వర్యంలో పలువురు మహిళలు టీడీపీలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరా రు. ఆయన వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో పత్తి చిన్నకుళాయి, రామలక్ష్మమ్మ, సుభద్ర, దీక్షిత, కీర్తనకుమారి, రాజకుళాయి, కుమార్, పెద్దకులాయి. నారాయణ, మహేశ్వరి, గొడుగు నంది, పుల్లయ్య, పెద్దపుల్లయ్య, తుపాకుల వెంకటేశ్వర్లు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ చేరిన వైసీపీ వర్గీయులు

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందిద్దామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డిలతో కలిసి ఎన్డీయే చార్జిషీట్ బుక్‌లెట్‌ను కోట్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.10లక్షల భారం మోపిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, గంజాయి, డ్రగ్స్‌తోపాటు రేషన్ బియ్యంలో రూ.8 లక్షల కోట్లు వైసీపీ కొట్టేసిందని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని విక్రయించి రాష్ట్రంలో 35 లక్షల మంది ఆరోగ్యాలను పాడు చేసి 30వేల మంది మహిళల తాళిబొట్లను వైసీపీ పాలకులు తెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని జగన్ మాట ఇచ్చి నేరుగా ప్రభుత్వమే రూ.లక్ష కోట్ల మద్యం అమ్మి దోచుకోవడం దారుణమన్నారు. వైసీపీ మేనిఫెస్టో హామీలు 99 శాతం అమలు చేశామని జగన్ అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇసుక ధరలు నాలుగు రెట్లు పెంచి భవన నిర్మాణ కార్మికులు 40 లక్షల మంది కడుపు కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.75వేల కోట్లు ప్రజలపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కేశవయ్య గౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, చిట్యాల మద్దయ్యగౌడు, హరి చక్రపాణి, ఎస్ఎండీ రఫి, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.



ఎన్డీయే చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

టీడీపీలో చేరిక

ప్యాపిలి: పట్టణంలోని వైసీపీకి చెందిన పలువురు శనివారం డోన్‌లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి ఆధ్వర్యంలో వారు చేరారు.

పెళ్లింట విషాదం

- కుందూ నదిలో ఈతకు వెళ్లి బావ మృతి
- మరదలి పరిస్థితి విషమం

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 27: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో శనివారం పెళ్లింట విషాదం నెలకొంది. కుందూ నదిలో పడి బావ మృతి చెందగా.. మరదలి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. గ్రామానికి చెందిన రామాంజనేయులుకు ఐదుగురు కుమార్తెలు. చిన్న కుమార్తెకు ఈ నెల 25వ తేదీన వివాహం జరిపించారు. అయితే ఈ నెల 26వ తేదీన తిరుపెళ్లి జరిగింది. ఈ పెళ్లికి తన మూడో కుమార్తె శివాణి, ప్రవీణ్ దంపతులు వచ్చారు. శనివారం మధ్యాహ్నం రామాంజనేయులు నాలుగో కుమార్తె కెజియా, ఆదిలక్ష్మిలతో పాటు, మూడో అల్లుడు, కూతురుతో కలిసి స్థానిక కుందూనదిలో ఈతకు వెళ్లారు. కుందూనదిలో రైతులు నీటి నిల్వ కోసం తీసిన గుంతను గమనించలేక కాలుజారి అందులో ప్రవీణ్, కెజియా పడి ఈత రాక గల్లంతయ్యారు. దీంతో అక్కడే ఉన్న శివాని, ఆదిలక్ష్మి కేకలు వేయటంతో అక్కడికి గ్రామస్థులు చేరుకొని వారిని బయటకు తీశారు. వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే ప్రవీణ్ (29) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కెజియా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్యాపిలి, ఏప్రిల్ 27: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట ప్యాపిలి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ప్యాపిలి, జలదుర్గం, ఎన్.రాచర్ల ఎస్ఐలు జగదీశ్వర్ రెడ్డి, విజయ్ కుమార్, చంద్రమోహన్, పోలీసులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: డీఎస్పీ

రుద్రవరం, ఏప్రిల్ 27: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ షర్ఫుద్దీన్ సూచించారు. శనివార రుద్రవరం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో చాగలమర్రి 1, బందర్లపల్లెలో మరో చెక్‌పోస్టు అలాగే ఆళ్లగడ్డలో ఒకటి, మరొకటి చింతకుంటలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థుల వెంట క్రిమినల్ కేసులో ఉన్న వారు ఉండకూడదని ఆళ్లగడ్డ ఆర్వో మల్లికార్జునరెడ్డికి నివేదిక ఇచ్చామన్నారు. 2019 ఎలక్షన్‌లో అహోబిళంలో ఒక ఘర్షణ, 90 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ బాలికల పాఠశాల వద్ద అల్లరి జరిగే మరో కేసు నమోదైనట్లు తెలిపారు. 1750 మందికి గాను 1500 మందిని బైండోవర్ చేశామన్నారు. అభ్యర్థులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేయడంతో 13 కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న 32 లక్షల నగదు, 7.5 కిలోల వెండి సీజ్ చేశామన్నారు. సీఐ చంద్రబాబు, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ధైర్యంగా ఓటు వేయండి'

డోన్(రూరల్), ఏప్రిల్ 27: ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని పాతబస్టాండు మీదుగా కొండపేట జెండా కట్ట వీధి వరకు పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం జెండా కట్టా వీధిలో ప్రజలనుద్దేశించి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేరప్రవృత్తి కలిగిన వారిపై నిఘా పెంచామని, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. ఈసమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ అస్రర్ బాషా, ట్రైనీ డీఎస్పీ రఘువీర్, పోలీసులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఇద్దరికి స్వల్ప గాయాలు

డోన్(రూరల్), ఏప్రిల్ 27: నంద్యాల జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. డోన్ మండలం వెంకటాపురం గ్రామ సమీ పంలోని చెరువు రోడ్డులో శనివారం తెల్లవారుజామున ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. రూరల్ సీఐ అస్రత్ బాషా తెలిపిన వివరాల మేరకు పత్తి కొండ మండలం జీవరాల తాండ గ్రామానికి చెందిన శంకర్ నాయక్ (40) మోటారు బైక్‌పై డోన్ నుంచి వెంకటాపురం గ్రామ ప్రధాన రోడ్డు మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ సీఐ అస్రత్ బాషా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని మహిళ..

నంద్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శోభా ఘాట్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో పెసల శ్రీవాణి(38) మృతి చెందారు. ఆళ్లగడ్డ పట్టణంలో జరిగే ఓ శుభకార్యానికి కడప జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిన్నకృష్ణారెడ్డి, భార్య శ్రీవాణి, కుమారుడు ప్రవీణ్ ఉత్తేజ్‌రెడ్డితో మోటార్‌సైకిల్‌పై శుక్రవారం వచ్చారు. శుభకార్యం చూసుకొని శనివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న ప్రైవేటు బస్సు శోభా ఘాటు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా, తండ్రి, కొడుకులకు స్వల్ప గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని యువకుడి..

చాగలమర్రి: మండలంలోని నగల్లపాడు హైవే వద్ద భవనాశి బ్రిడ్జి వంతెనలో ఆళ్లగడ్డ వైపు నుంచి చాగలమర్రి వైపు వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి బ్రిడ్జిలో బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన యువకుడు చక్రపాణి (20) కారులో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. టోల్‌ప్లాజా సిబ్బంది బ్రిడ్జిలోపల పడ్డ కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు. కారులో ఇరుక్కపోయిన చక్రపాణిని బయటకు తీశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కారులో బ్రిడ్జిలోపల పడటంతో నుజ్జు అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చక్రపాణి ప్రొద్దుటూరులోని ఎస్ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సెలవు దినాల్లో డ్రైవర్‌గా కూలీకి వెళ్తూ తన చదువును కొనసాగిస్తున్నాడు. ఇందులో భాగంగా డ్రైవర్‌గా వెళ్లి ప్రమాదంలో చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 27: కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన మాదిగ నాగమల్లికార్జున అనే యువకుడిపై దాడి ఘటనకు సంబంధించి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. మల్లికార్జున ఈనెల 24వ తేదీన తాడిపత్రి నుంచి ఇటిక్యాల గ్రామానికి బస్సులో వస్తుండగా, తన స్నేహితురాలి పక్క సీటులో కూర్చున్నావంటూ కనక్రాదిపల్లె గ్రామానికి చెందిన కార్తీక్, దస్తగిరి, ఇటిక్యాల గ్రామానికి చెందిన నరేందారెడ్డి కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

బేతంచెర్ల, ఏప్రిల్ 27: పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి పట్టణ వీధుల గుండా స్వామివారి రథాన్ని ఊరేగించారు. పారిశ్రామికవేత్త బుగ్గన శ్రీధర్ రెడ్డి, బుగ్గన విశ్వనాథరెడ్డి, మారుతి కృష్ణశర్మ, కృష్ణారావు, అర్చకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

రుద్రవరం, ఏప్రిల్ 27: మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామ సమీపంలో నాగులవరం, ఆర్.కొత్తపల్లె రహదారి మట్టి రహదారిని ఎక్స్‌కవేటరుతో తవ్వేసినట్లు వెంకటరాజ గౌరీశంకర్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శనివారం తెలిపారు. చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు అదే గ్రామానికి చెందిన పెద్ద నరసింహారెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి నెల రోజుల జైలు, జరిమానా

కోవెలకుంట్ల, ఏప్రిల్ 27: మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డ కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామానికి చెందిన గోపాల్‌కు డ్రంకన్ డ్రైవ్ కేసులో కోవెలకుంట్ల న్యాయాధికారి షేక్ అబ్దుల్ రహిమాన్ ఒక నెల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు సీఐ జయచంద్ర శనివారం తెలిపారు. కోవెలకుంట్ల నుంచి నంద్యాలకు వెళ్లే రహదారిలో బాలికల గురుకుల కళాశాల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గోపాల్ మద్యం సేవించి బైక్ నడుపుతున్నట్లు గుర్తించామని అన్నారు. నిందితుడిని కోవెలకుంట్ల కోర్టులో హాజరుపరచగా నెలరోజులు జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

గడ్డివాముల దగ్ధం

దొర్నిపాడు, ఏప్రిల్ 27: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లెలో ప్రమాదవశాత్తు 8 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పగడాల శివసుబ్బరాయుడు, పగడాల ప్రసాద్, సిద్ధం తానేశ్వర్‌రెడ్డి, బద్రి రామకృష్ణ, చదువుల లక్ష్మీరెడ్డి, పందిర్ల మాధవరెడ్డికి చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ప్రభుత్వాసుపత్రికి రోటరీ క్లబ్ విరాళం

బేతంచెర్ల, ఏప్రిల్ 27: బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ సుమారు రూ.30వేల విలువ చేసే నాలుగు మంచాలను ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సాగరికకు శనివారం అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ సాగరిక మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన మంచాలు లేక రోగులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సామాజిక సేవలో భాగంగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్ రెడ్డి, శ్రీధర్ ఆసుపత్రికి నాలుగు మంచాలు అందజేయడం హర్షణీయమన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దిలేటిస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రుద్రవరం, ఏప్రిల్ 27: మండలంలోని టి.కొట్టాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, బాల కృష్ణ, మహానంది, శివరాముడుతో పాటు పది కుటుంబాలు టీడీపీ నాయకుడు భార్గవరామ్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

'వంద పని దినాలు కల్పించాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 27: ఉపాధి కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలని పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని మల్లేవేముల, గొట్లూరు గ్రామాల సమీపంలోగల కేసీ కాలువలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: అఖిలప్రియ

చాగలమర్రి, ఏప్రిల్ 27: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మండంలోని శెట్టివీడు, గొడిగనూరు, తోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. నాయకులు రాముయాదవ్, నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ సర్పంచ్‌లు ఇండ్ల లక్ష్మీరెడ్డి, స్వప్న, నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, మస్తాన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



గొడిగనూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న భూమా అఖిలప్రియ

● తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన చిన్న అంకాల్‌రెడ్డి, సంజీవరెడ్డితో పాటు మరో 10 కుటుంబాలు శనివారం రాత్రి ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్, రమణ, శ్రీను, ఉసేన్‌రెడ్డి, ఇండ్ల రమణారెడ్డి, బాషా, సయ్యద్ షరీఫ్, రసూల్ పాల్గొన్నారు.

అఖిలప్రియ ప్రచారం

నంద్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ప్రచారం చేశారు. కోటకందుకూరు మాజీ సర్పంచ్ నల్లగట్ల రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో, ఆర్. క్రిష్ణాపురంలో సొసైటీ మాజీ ప్రెసిడెంట్ శివారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో, మర్రిపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తోడెండ్లపల్లెలో అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు